గాల్లో కార్మికుల ప్రాణాలు..!

- సేఫ్టీ పరికరాలు లేకుండానే ఆర్టిజన్ల పనులు
- తరుచూ విద్యుత్ ప్రమాదాలకు గురవుతున్న వైనం
- పట్టించుకోని క్షేత్రస్థాయి అధికారులు



సేఫ్టీ పరికరాలు లేకుండానే విద్యుత్ మరమ్మతులు చేస్తున్న కార్మికుడు

చార్మినార్: అత్యవసర సమయాల్లో పని చేసే విద్యుత్ కార్మికులు (ఆర్టిజన్స్) ప్రాణాల పరిస్థితి గాల్లో దీపంలా మారుతోంది. విద్యుత్ సరఫరా పునరుద్ధరించాలనే తొందరలో ఎలాంటి సేఫ్టీ పరికరాలు ధరించకపోవడం..మరోవైపు సంబంధిత అధికారులు సైతం ముందస్తు జాగ్రత్తలు తీసుకోకపోవడంతో తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. పని సమయాల్లో తప్పనిసరిగా హెల్మెట్, గ్లౌజ్, ఆర్తింగ్ రాడ్, షూస్, బెల్టు వినియోగించాల్సి ఉంటుంది. అయితే చాలా సందర్భాల్లోనూ వీటిని వినియోగించడం లేకపోవడంతో విద్యుత్ షాక్‌కు గురవుతున్నారు.

అధికారుల పర్యవేక్షణ లోపం..

సాంకేతిక కారణాలతో అప్పుడప్పుడు విద్యుత్ ప్రమాదాలు సంభవించినప్పుడు ఆయా ప్రాంతాల్లో సరఫరా నిలిచిపోతోంది. మరమ్మతులకు వెళ్లే కార్మికులు సంబంధిత ఫీడర్ నుంచి సరఫరాను నిలిపివేయాలని ఖచ్చితమైన సమాచారం అందజేస్తున్నారు. అయినప్పటికీ సంబంధిత అధికారులు ఆయా ట్రాన్స్‌ఫార్మర్ల ఫీడర్ల నుంచి సరఫరాను పూర్తిగా నిలిపి వేసే చర్యలు తీసుకోవడంలో విఫలమవుతున్నారనే విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి.

కార్యాలయాలకే పరిమితం..

అధికారులు కేవలం ఆదేశాలు జారీ చేయడం వరకే పరిమితమవుతున్నారని.. క్షేత్ర పరిశీలనకు రాకుండా కార్యాలయాల్లోనే ఉంటూ ముందు జాగ్రత్త చర్యలు తీసుకోకపోవడంతోనే ప్రమాదాలు సంభవిస్తున్నాయని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ సరఫరా పునరుద్ధరించే సమయంలో సంబంధిత ఏఏఈ, ఏఈలు తప్పనిసరిగా ఫీల్డ్‌లో ఉండాలని.. సమస్య తీవ్రంగా ఉంటే ఏడీఈ, డీఈ స్థాయి అధికారులు సైతం క్షేత్ర పరిశీలనకు రావాల్సి ఉన్నా పట్టించుకోవడం లేదంటున్నారు. తమ ప్రాణాలకు రక్షణ కల్పించాల్సిన అధికారులు కేవలం పనులు చేయించడానికే పరిమితం అవుతున్నారంటూ వాపోతున్నారు.

తూతూ మంత్రంగా భద్రతా వారోత్సవాలు..

యేటా టీఎస్ఎస్‌పీడీసీఎల్ ఆధ్వర్యంలో భద్రతా వారోత్సవాలు నిర్వహించి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కార్మికులకు అవగాహన కల్పిస్తుంటారు. అయినా మరమ్మతులకు వెళ్లేటప్పుడు కార్మికుడు వాటిని పాటించడం లేదు. దీంతో భద్రతా వారోత్సవాల కార్యక్రమం నిష్ప్రయోజనంగా మారుతోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి విద్యుత్ మరమ్మతులకు వెళ్లే కార్మికులు తప్పనిసరిగా హెల్మెట్, గ్లౌజ్, ఆర్తింగ్ రాడ్, షూస్, బెల్టు వాడేలా సంబంధిత లైన్‌మెన్, ఏఈ చర్యలు తీసుకుంటేనే ప్రమాదాల నివారణ సాధ్యమయ్యే అవకాశాలుంటాయి.

వచ్చేనెల 5 నుంచి ఆన్‌లైన్ కిడ్స్ ఆర్ట్ క్యాంపు

నాంపల్లి: వచ్చే నెల 5 నుంచి జూన్ 5 వరకు కిడ్స్ ఆర్ట్ క్యాంపు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. మాసబ్‌ట్యాంక్‌లోని ఫైన్ ఆర్ట్స్ విశ్వవిద్యాలయంలో శిక్షణ పొందిన నిష్ణాతులచే వేసవి సెలవుల్లో పిల్లలు బయటకు వెళ్లకుండా ఇంట్లోనే ఉంటూ ఆన్‌లైన్‌లో డ్రాయింగ్ నేర్చుకోవచ్చని పేర్కొన్నారు. ఆసక్తి గల వారు తమ పేరును రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని, మరిన్ని వివరాలకు 6304366780 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

మదర్సాలు, మసీదులపై దాడులు తగవు



మజ్లిస్ నాయకులు, మసీదు ప్రతినిధులతో ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: మదర్సాలు, మసీదులపై దాడులు తగవని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. సంగారెడ్డి జిల్లా జిన్నారంలో మసీదులు, మదర్సాలపై దాడులు జరిగిన నేపథ్యంలో ఆయా ప్రతినిధులు బుధవారం ఆయనను కలిశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ ఘటనలపై సంగారెడ్డి జిల్లా ఎస్పీని కలిసి దాడికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని కోరమన్నారు. అలాగే తాను త్వరలోనే జిన్నారంలో పర్యటించి ముస్లిమేతర పెద్దమనుషులను కలిసి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని కోరతానని పేర్కొన్నారు. ఆయన వెంట మజ్లిస్ సీనియర్ నాయకుడు యామీన్‌ఖాన్ తదితరులు ఉన్నారు.

శాస్త్రీయ కళలను భావితరాలకు అందించాలి



చిన్నారులతో ఎంపీ ఈటల రాజేందర్

గన్‌ఫౌండ్రీ: శాస్త్రీయ కళలను భావితరాలకు అందించాలని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ పేర్కొన్నారు. రవీంద్రభారతిలో శ్రీ కూచిపూడి డ్యాన్స్ అకాడమీ 30వ వార్షికోత్సవ వేడుకలను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన హాజరై మాట్లాడుతూ.. ఏక కాలంలో ఇంతమంది చిన్నారులు ప్రదర్శన ఇవ్వడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో అకాడమీ వ్యవస్థాపకురాలు విమల నీలం తదితరులు పాల్గొన్నారు.

హజ్ యాత్రికులు మెడికల్ ఫైల్ తీసుకురావాలి



హజ్ యాత్రికులకు వైద్య పరీక్షలు చేస్తున్న దృశ్యం

గోల్కొండ: వ్యాక్సినేషన్ శిబిరానికి వచ్చే హజ్ యాత్రికులు తమ మెడికల్ ఫైల్ కూడా తీసుకురావాలని రాష్ట్ర వక్ఫ్ బోర్డు కార్యానిర్వహణ అధికారి సజ్జాద్ ఆలీ అన్నారు. గోల్కొండ ఏరియాసుపత్రిలో హజ్ యాత్రికులకు నిర్వహిస్తున్న వ్యాక్సినేషన్ క్యాంప్‌ను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సీనియర్ సిటిజన్స్ కోసం ప్రత్యేకంగా ఇక్కడ వ్యాక్సినేషన్ కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఆయన వెంట సీనియర్ కాంగ్రెస్ నాయకుడు హబీబ్ జైనులాబీదున్ ఆబీద్ తదితరులు ఉన్నారు.

వాలీబాల్ కోర్టు ప్రారంభం



బీజేపీ నాయకుడు దేవర వంశీ తదితరులను సన్మానిస్తున్న దృశ్యం

గోల్కొండ: గుడిమల్కాపూర్‌లోని రాజలింగయ్య కబడ్డీ స్టేడియంలో నూతనంగా ఏర్పాటు చేసిన వాలీబాల్ కోర్టును గుడిమల్కాపూర్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు దేవర వంశీ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గుడిమల్కాపూర్‌తో పాటు కార్వాన్ నియోజకవర్గ పరిధిలోని వాలీబాల్ క్రీడాకారులు ఇక్కడికి వచ్చి ప్రాక్టీస్ చేసుకోవచ్చన్నారు. త్వరలోనే వాలీబాల్ కోచ్‌ను కూడా నియమిస్తామని తెలిపారు. కార్యక్రమంలో అశోక్‌యాదవ్, సుధాకర్‌యాదవ్, మధుసూదన్, కోచ్ అబ్దుల్ ఖలీల్, కిశోర్‌యాదవ్ తదితరులు ఎన్నారు.

సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ ధర్నా



కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నేతలు

మైలార్‌దేవ్‌పల్లి: కాటేదాన్ ఇండస్ట్రీ ఐలా కార్మికుల సమస్యల పరిష్కారించాలని కాటేదాన్ ఇండస్ట్రియల్ కమిషనర్ ఆఫీసు ముందు బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. సీఐటీయూ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు జాజాల రుద్రకుమార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్మికులకు వేతనాలను చెల్లించాలని ప్లకార్డులు ప్రదర్శిస్తు నిరసన తెలిపామన్నారు. కార్యాలయంలో కమిషనర్‌తో పాటు అధికారులు ఎవరు అందుబాటులో ఉండడం లేదన్నారు. ధర్నా నిర్వహించి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని సిబ్బందికి అందించామన్నారు. ఆయన మాట్లాడుతూ అనేక సంవత్సరాలుగా కార్మికులు పని చేస్తున్నారని శానిటేషన్ ఇండస్ట్రియల్ ఐలా కార్మికులు గత రెండు నెలల కాలం నుంచి వేతనాలు చెల్లించడం లేదన్నారు. కుషాయిగూడ, నాచారం, చర్లపల్లి, మౌలాలి తదితర ప్రాంతాల్లో కార్మికులకు 19600 వేతనాలు చెల్లిస్తున్నారని అదే విధంగా ఇక్కడ పని చేస్తున్న కార్మికులకు కూడా అందించాలన్నారు. కార్మికులందరిని బట్టలు, చీపుర్లు, కట్టెలు, చెప్పులు, షూ, గ్లౌజ్‌లు ఇతర సేఫ్టీ పరికరాలు 30 రోజులకు సరిపడి అందించి ప్రతి నెల సమకూర్చాలన్నారు. వారం, పది రోజుల్లో కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ కాటేదాన్ ఇండస్ట్రియల్ ఏరియా కన్వీనర్ పి.సి.కె.భాస్కర్, భవన నిర్మాణ కార్మిక సంఘం మండల కార్యదర్శి వెంకటయ్య, ఆర్.రమేష్, కార్మికులు బాబు, చంద్రకళ, రామచందర్, శైలజ, లక్ష్మమ్మ, రమ, ఉమా, వేణు, ప్రమీల, అశోక్, యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.

మేడే పోస్టర్ ఆవిష్కరణ

మైలార్‌దేవ్‌పల్లి: కార్మిక దినోత్సవం మే డే వేడుకలకు సంబంధించిన పోస్టర్‌ను సీఐటీయూ నాయకులు బుధవారం ఆవిష్కరించారు. ముఖ్య అతిథిగా హాజరైన సీఐటీయూ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు జాజాల రుద్రకుమార్ మాట్లాడుతూ... మండల పరిధిలోని ప్రతి డివిజన్ కేంద్రంలోని అడ్డాల వద్ద సీఐటీయూ జెండాలను ఎగరవేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ఎనిమిది గంటల పనిదినాన్ని అమలు చేయకుండా 12 గంటలు యజమానులకు అనుకూలంగా చట్టాలను తీసుకువచ్చిందన్నారు. కార్మికులకు కనీస వేతనం రూ. 26 వేలు చేయాలని సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును కేంద్ర ప్రభుత్వం అమలు చేయడం లేదన్నారు. నాలుగు లేబర్ కోడ్లను అమలులోకి తెచ్చి కార్మికులను ముప్పుతిప్పలు పెడుతుందన్నారు. ఒక వైపు నిత్యావసర సరుకుల ధరలు పెంచుతూ మరో వైపు కార్మికుల చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా తీసుకొచ్చి కార్మికుల నడ్డి విరగగొడుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా మే 20వ తేదీన దేశవ్యాప్తంగా సమ్మె చేపడుతున్నామన్నారు. సీఐటీయూ కాటేదాన్ క్లస్టర్ పారిశ్రామిక కోశాధికారి పి.సి.కె.భాస్కర్, భవన నిర్మాణ కార్మిక సంఘం మండల కార్యదర్శి వెంకటయ్య, భవన నిర్మాణ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు బజ్జలకూర స్వామి, నేతలు రమేష్, శివ, రాంచందర్, చంద్రకళ, శైలజ, లక్ష్మమ్మ, రమా, ఉమా, వేణు, ప్రమీల, అశోక్, యాదమ్మ, ప్రవీణ్, సచిన్ తదితరులు పాల్గొన్నారు.

పీవీ నరసింహరావు ఫ్లైఓవర్‌పై కారు బోల్తా

మైలార్‌దేవ్‌పల్లి: పి.వి.నరసింహారావు ఎక్స్‌ప్రెస్‌వేపై బుధవారం మధ్యాహ్నం ఓ కారు వేగంగా దూసుకువచ్చి అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టి బోల్తా పడింది. ఈ సంఘటనలో కారులో ఉన్న ముగ్గురికి ఎలాంటి గాయాలు కాలేదు. ఈ సంఘటనతో పి.వి.నరసింహారావు ఎక్స్‌ప్రెస్ వేపై ట్రాఫిక్‌కు గంటపాటు అంతరాయం ఏర్పడింది. మెహిదీపట్నం నుంచి శంషాబాద్ వెళ్తున్న కారు వేగంగా దూసుకొచ్చి పిల్లర్ నెంబర్ 151 వద్ద అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. అనంతరం పల్టీ కొట్టి రోడ్డుపై రాసుకుంటూ వెళ్లింది. ఈ సంఘటన జరిగిన సమయంలో కారులో ముగ్గురు యువకులు ఉన్నట్లు స్థానికులు తెలిపారు. కారులోని ముగ్గురు యవకులకు ఎలాంటి ప్రమాదం చోటు చేసుకోలేదని... ప్రమాదం జరిగిన వెంటనే వారు కారు దిగి వెళ్లిపోయారని స్థానికులు, పోలీసులకు సమాచారం అందించారు. కారు బోల్తాపడటంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని కారును స్టేషన్‌కు తరలించారు. ఈ సంఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని రాజేంద్రనగర్ పోలీసులు తెలిపారు.

నేటి నుంచి లండన్‌సిటీ ఇన్ హైదరాబాద్ ఎగ్జిబిషన్

లంగర్‌హౌస్: లండన్‌సిటీ ఇన్ హైదరాబాద్ అనే థీమ్‌తో ఇన్‌ప్యాంట్ అండ్ హ్యాండ్‌లూమ్ ఎగ్జిబిషన్‌ను లంగర్‌హౌస్‌లో ఈనెల 24 నుంచి నిర్వహించనున్నట్లు నిర్వాహకులు రాబిన్‌సన్ తెలిపారు. బుధవారం లంగర్‌హౌస్‌లో ఆయన మాట్లాడుతూ.. లండన్ సిటీ బ్రిడ్జి ఎగ్జిబిషన్‌లో ప్రత్యేక ఆకర్షణగా ఉంటుందని, కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ దీనిని ప్రారంభిస్తారని తెలిపారు. 60 రోజుల పాటు కొనసాగుతుందని పేర్కొన్నారు. లండన్ సిటీ బ్రిడ్జి ప్రవేశం ద్వారం వద్ద ఉంటుందని దీనిని ఎక్కి ఎగ్జిబిషన్‌లోకి ప్రవేశించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

ఉగ్రదాడిని ఖండించిన ఐఎంఏ



సుల్తాన్‌బజార్: జమ్మూకశ్మీర్‌లోని పహల్గాం సమీపంలో బైసరాన్ మైదానం వద్ద జరిగిన ఉగ్రదాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ దువ్వూరి ద్వారకనాథ రెడ్డి బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ దాడిలో 28 మంది అమాయక ప్రజలు మృతిచెందడం బాధకరమన్నారు. దాడి చేసినవారిపై ప్రభుత్వాలు కఠిన చర్యలు తీసుకుని బాధితులకు న్యాయం చేయాలని, అలాగే ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని విన్నవించారు.

28 నుంచి లలిత కళల్లో శిక్షణ తరగతులు

విజయనగర్‌కాలనీ: వేసవి సెలవుల నేపథ్యంలో లలిత కళలో (ఫైనార్ట్స్) స్వల్పకాలిక శిక్షణ ఇవ్వనున్నట్లు మాసబ్‌ట్యాంక్ జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైనార్ట్స్ యూనివర్శిటీ ప్రభుత్వ లలిత కళల కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎంఎల్ ఆనంద్‌రావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. 8 నుంచి 15 ఏళ్లలోపు పిల్లలకు డ్రాయింగ్, పెయింటింగ్, ఫొటోగ్రఫీ, యానిమేషన్, పోటరి, క్యాలీగ్రఫీ తదితర విభాగాల్లో శిక్షణ ఉంటుందని తెలిపారు. సమ్మర్ క్యాంపు ఈనెల 28 నుంచి ప్రారంభమై జూన్ 2 వరకు కొనసాగుతుందని తెలిపారు. ఈ నెల 27 లోగా ఆసక్తి గల విద్యార్థులు మాసబ్‌ట్యాంక్ ఫైనార్ట్స్ కళాశాలలో దరఖాస్తు అందజేయవచ్చన్నారు. మరిన్ని వివరాలకు 93470 48708, 80992 24945 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

యువతిపై పోకిరీల వేధింపులు

చాంద్రాయణగుట్ట: విధులు ముగించుకుని ఇంటికి వెళ్తున్న యువతిపై గుర్తు తెలియని యువకులు వేధింపులకు పాల్పడిన ఘటన బండ్లగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం రాత్రి జరిగింది. దీంతో ఎదురుతిరిగి ప్రశ్నించిన యువతిపై యువకులు పిడిగుద్దులతో దాడి సైతం చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రక్షాపురం కాలనీకి చెందిన యువతి కొండాపూర్‌లో ప్రైవేట్ ఉద్యోగం చేస్తోంది. మంగళవారం రాత్రి 10 గంటలకు విధులు ముగించుకుని ద్విచక్ర వాహనంపై ఇంటికి వస్తుండగా కొందరు యువకులు ఆమెను కారులో వెంబడిస్తూ, వెకిలి చేష్టలకు దిగారు. ఇదేంటంటూ సదరు యువతి ద్విచక్ర వాహనాన్ని ఆపి ప్రశ్నించింది. దీంతో రెచ్చిపోయిన ముగ్గురు యువకులు ఆమె ముఖంపై దాడి చేసి పరారయ్యారు. వెంటనే యువతి స్థానిక బండ్లగూడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.

నేటికీ చదువుతున్న విలియం రచనలు



డాక్టర్ సంగీతకు అవార్డు అందజేస్తున్న రాజ్‌నారాయణ ముదిరాజ్ తదితరులు

గన్‌ఫౌండ్రీ: విలియం షేక్స్పియర్ రచనలను ఇప్పటికీ ప్రపంచవ్యాప్తంగా అనేకమంది చదువుతున్నారని ఓయూ ప్రొఫెసర్ ఎ.కరుణాకర్ అన్నారు. కింగ్ కోఠిలోని సెయింట్ జోసెఫ్ కళాశాలలో వికాస భారతి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రపంచ ఆంగ్లభాష దినోత్సవం, విలియం షేక్స్పియర్ జయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 25 ఏళ్లుగా ఆంగ్లభాషలో సేవలందిస్తున్న డాక్టర్ ఎం.సంగీతకు విలియం షేక్స్పియర్ ఎక్సలెన్సీ అవార్డును అందజేశారు. కార్యక్రమంలో తెలంగాణ మేధావుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రాజ్‌నారాయణ ముదిరాజ్, కళాశాల ప్రిన్సిపాల్ రెవరెండ్ ఫాదర్ అంథోని సగయ రాజ, జి.నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన నృత్య ప్రదర్శన



నృత్యం చేస్తున్న స్వప్న సుందరి



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అతిథులు

సుల్తాన్‌బజార్: నవ్య నాటక సమితి నిర్వహణలో తెలంగాణ సారస్వత పరిషత్ ఆడిటోరియంలో బుధవారం సాయంత్రం జరిగిన పద్మభూషణ్ విధూషి స్వప్న సుందరి 'లాస్య లతి' అభినయ ప్రధాన నృత్య ప్రదర్శన అలరించింది. ముందుగా పుష్పాంజలితో స్వప్న సుందరి నాట్య ప్రదర్శన ప్రారంభించిన అనంతరం ఇతర రాష్ట్రాలకు చెందిన వాగ్గేయకారులు తెలుగు రచనలకు నృత్య ప్రదర్శనలు చేశారు. పూర్వ ఐఏఎస్ డాక్టర్ ఆర్‌వీ.చంద్రావదన్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. భారతీయ నృత్యాలు మన సంస్కృతి సాంప్రదాయాలకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నాయన్నారు. కార్యక్రమంలో జి.వసుంధర, దేవాదాయ శాఖ అదనపు కమిషనర్ కృష్ణవేణి, డాక్టర్ ఇందారా హేమ, లక్ష్మీమానస, మధుమతి కులకర్ణి, హేమరాజు, విజయ్‌కుమార్, శర్మ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ఉద్యమంలో జ్ఞానేశ్వర్‌ది కీలకపాత్ర



జ్ఞానేశ్వర్ దంపతులను సన్మానిస్తున్న ముఖ్య అతిథులు

సుల్తాన్‌బజార్: టీఎన్జీఓస్ నేత జ్ఞానేశ్వర్ తెలంగాణ ఉద్యమంలో తనతో పాటు కీలకంగా పనిచేశారని ఎమ్మెల్సీ కోదండరామ్ అన్నారు. అబిడ్స్‌లోని తెలంగాణ సారస్వత పరిషత్‌లో తెలంగాణ టీఎన్జీఓస్ నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు దాస్య నాయక అధ్యక్షతన పదవీవిరమణ కార్యక్రమం బుధవారం జరిగింది. ముఖ్య అతిథులుగా ఆయనతో పాటు పింగలి శ్రీపాల్ రెడ్డి, టీఎన్జీఓస్ కేంద్ర సంఘం అధ్యక్షుడు మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి ముజీబ్ పాల్గొని గడ్డం జ్ఞానేశ్వర్ దంపతులకు పూలమాలలు వేసి శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఖాదర్‌బిన్ హసన్, అసోసియేట్ అధ్యక్షుడు రాజేందర్, ధన్‌రాజ్, రమేష్ పాల్గొన్నారు.

ఉగ్రదాడిపై ప్రజాగ్రహం

నిరసనలు, ర్యాలీలు ఉగ్రవాదుల దిష్టిబొమ్మల దహనం

అబిడ్స్: జమ్మూకశ్మీర్‌లో ఉగ్రదాడికి నిరసిస్తూ హైదరాబాద్ జిల్లా బీజేపీ నాయకుడు నితీన్ నందకర్ ఆధ్వర్యంలో ఎంజేమార్కెట్ చౌరస్తాలో పాకిస్తాన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ బుధవారం దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్రమోదీ ఆధ్వర్యంలో పాకిస్తాన్‌కు తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో పలువురు బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

గౌలిపురా డివిజన్‌లో..

గౌలిపురా: గౌలిపురా డివిజన్ బీజేపీ అధ్యక్షుడు సుమన్ కుమార్ ముదిరాజ్ ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం గౌలిపురా చౌరస్తా నుంచి లాల్‌దర్వాజా మోడ్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఉగ్ర దాడిలో మృతి చెందిన వారికి నివాళులర్పించారు. కార్యక్రమంలో గౌలిపురా కార్పొరేటర్ ఆల భాగ్యలక్ష్మి, మాజీ కార్పొరేటర్ ఆలే జితేంద్ర, నాయకులు జి.రఘుకాంత్, జి.ధీరజ్‌లాల్, శివ చంద్రగిరి, రాజ్ కుమార్, జమాల్‌పూర్ అశోక్, రాజేశ్, ప్రేమ్‌రాజ్, సాయి కుమార్, శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

కార్వాన్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడి ఆధ్వర్యంలో..

గోల్కొండ: కార్వాన్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు ఉద్దడి జగదీశ్‌కుమార్ ఆధ్వర్యంలో గుడిమల్కాపూర్‌లో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. కార్వాన్‌లోని కేసరి హనుమాన్ ఆలయం నుంచి ర్యాలీ ప్రారంభమై దర్బార్ మైసమ్మ ఆలయం వరకు కొనసాగింది. కార్వాన్ నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి టి.అమర్‌సింగ్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఆసిఫ్‌నగర్ గాంధీబొమ్మ చౌరస్తా వద్ద..

విజయనగర్‌కాలనీ: నాంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఫెరోజ్‌ఖాన్, కె.రవితేజ ఆసిఫ్‌నగర్ గాంధీబొమ్మ చౌరస్తా వద్ద కొవ్వొత్తులు వెలిగించి ఉగ్రదాడిలో మృతిచెందిన వారికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఉగ్రవాదాన్ని ప్రేరేపిస్తున్న పాకిస్తాన్ జెండాను తగలబెట్టారు. కార్యక్రమంలో నాయకులు దిడ్డి పెంటయ్య, వెంకటేశ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

బేగంబజార్‌లో వ్యాపారులు..

అబిడ్స్: ది హైదరాబాద్ కిరాణ మర్చంట్ అసోసియేషన్ ప్రతినిధులు ఉగ్రవాదులకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ బుధవారం రాత్రి ర్యాలీ చేపట్టారు. ఉగ్రవాద చర్యలు పిరికిపంద చర్యలుగా అభివర్ణించారు.



ర్యాలీలో పాల్గొన్న కార్పొరేటర్ ఆలె భాగ్యలక్ష్మి



కొవ్వొత్తుల ర్యాలీ తీస్తున్న బీజేపీ నాయకులు



పాకిస్తాన్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ నాయకులు



కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహిస్తున్న వ్యాపారులు